క్లుప్తంగా

రీ సర్వే వేగవంతం చేయాలి

మునగపాక : బూత్‌లెవెల్ అధికారులు ఓటరు నమోదుపై దృష్టి సారించాలని అసిస్టెంట్ కలెక్టర్ ఫి.ధాత్రిరెడ్డి కోరారు. శనివారం ఆమె మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో బూత్‌లెవెల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదులో భాగంగా చేర్పులు, మార్పులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం స్థానికంగా రీ–సర్వే ఎంత మేర జరిగిందనే విషయమై సర్వేయర్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. రామభద్రపురంలోని భూముల్లో రాళ్ల పాతడం వేగవంతమయ్యేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, ఆర్ఐ రమేష్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న లారీ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గ్రావెల్ లారీ

మునగపాక : మండలంలోని పాటిపల్లి సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని మునగపాక పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా గ్రావెల్ తరలిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ ఆలీ శనివారం తెల్లవారు దాడి చేయగా ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కాకినాడ వెళ్లి పింఛను అందజేత



చక్రరావుకి పింఛను అందిస్తున్న వలంటీర్ సుప్రియ

పాయకరావుపేట : పట్టణంలో గల ఒకటో సచివాలయ పరిధిలో గల మాన్యంబుగారి వీధికి చెందిన దాసం చక్రరావుకి ప్రతి నెలా కాకినాడ వెళ్లి వృద్ధాప్య పింఛను అందిస్తున్నట్టు సచివాలయ గ్రామ వలంటీర్ పి.సుప్రియ తెలిపారు. కొన్ని నెలలుగా దాసం చక్రరావు కాలికి గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందారన్నారు. ప్రస్తుతం బంధువుల ఇంట్లో చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్నందున కాకినాడ వెళ్లి ప్రతి నెలా పింఛను పంపిణీ చేయడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్టు వలంటీర్ సుప్రియ తెలిపారు.

గణపర్తి పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన డీఎస్పీ

మునగపాక : మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆయన పదో తరగతి పరీక్ష జరుగుతున్న గణపర్తి హైస్కూల్‌ను సందర్శించారు. పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పరీక్ష కేంద్రానికి సమీపంలోకి ఎవరూ రాకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ మహమ్మద్ ఆలీ ఉన్నారు.

తోటాడలో నేడు ఉచిత వైద్య శిబిరం

మునగపాక : మండలంలోని తోటాడ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో తోటాడ ఓంకారం పీఠం వద్ద ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. చర్మ, సుగర్, గుండె, ఎముకలు, దంత, స్త్రీల వైద్య నిపుణులు సేవలందిస్తారన్నారు.

నేత్రపర్వంగా కామాక్షిదేవి ఊంజల్ సేవ

అనకాపల్లిటౌన్ : గవరపాలెం కామాక్షిదేవి ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారి ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊయలలో ఉంచి ఊంజల్ సేవ నిర్వహించారు. నెలలో మొదటి శుక్రవారం అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించడం ఆనవాయితీ. విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగులకొండ సూర్యాచారి దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

చక చకా... జగనన్న కాలనీలు

- జోరందుకుంటున్న ఇళ్ల నిర్మాణాలు
- ఊళ్లుగా దర్శనమిస్తున్న లేఅవుట్లు

మొత్తం లే అవుట్లు	143
మంజూరయిన ఇళ్లు	9076
పూర్తయిన ఇళ్లు	1735
వివిధ దశల్లో ఉన్నవి	5780
ఇప్పటి వరకు బిల్లు చెల్లింపులు రూ.49 కోట్లు	

నక్కపల్లి : పేదలకు ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం జోరందుకుంది. కాలనీలు జగన్‌మోహనపురాలుగా అవతరిస్తున్నాయి. ఒకే ప్రాంతంలో ఇళ్ల లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలకు ఉపక్రమించడంతో కాలనీలు కాదు... ఊళ్లుగా మారుతున్నాయి. ప్రతి పేద వాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో 2019లో అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. గ్రామాల్లో ప్రత్యేకంగా లేఅవుట్లు ఏర్పాటు చేసి ప్లాట్లు కేటాయించింది. రోడ్లు, విద్యుత్, వాడుక నీరు, తాగునీరు సదుపాయం కూడా ఏర్పాటు చేసింది. వీరందరికీ పక్కా ఇళ్లు కూడా మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు లబ్ధిదారులు ఇళ్ల నిర్మించుకునేందుకు అవసరమైన ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తోంది. అలాగే సిమెంట్, ఇనుము తదితర మెటీరియల్‌ను తక్కువ ధరలకు సరఫరా చేయడంతో లబ్ధిదారులంతా సొంతింటి నిర్మాణాలు ప్రారంభించారు.




రోడ్లు, విద్యుత్ సదుపాయం కల్పించడంతో రాజయ్యపేటలో ఇళ్ల నిర్మాణాలు

మెగా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు

పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి మండలంలో 36, పాయకరావుపేట మండలంలో 20, ఎస్.రాయవరం మండలంలో 44, కోటవురట్ల మండలంలో 43, లేఅవుట్లు ఏర్పాటు చేశారు. 9176 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. 9076 మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. మెగాలేవుట్లలో కొన్ని చోట్ల 100 నుంచి 250 మందికి ఒకే చోట మెగా లేఅవుట్ వేసి ప్లాట్లు కేటాయించారు. పాయకరావుపేట మండలం పీఎల్‌పురం వద్ద 42 ఎకరాల విస్తీర్ణంలో మెగా లేఅవుట్ ఏర్పాటు చేసి దాదాపు 300 మందికి ఒకేచోట ప్లాట్లు కేటాయించారు. ఈ మెగా లేఅవుట్‌లకు జగనన్న కాలనీలుగా నామకరణం చేశారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. కొంతమంది నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు కూడా జరుపుకొన్నారు. నక్కపల్లి మండలం చందనాడ, రాజయ్యపేట, నక్కపల్లిలలో కూడా మెగా లేఅవుట్లు వేసి ప్లాట్లు కేటాయించడంతో ఆయా ప్రాంతాల్లో కూడా ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి.

పూర్తయినవి...పూర్తి కానున్నవి...

- నక్కపల్లి మండలం చందనాడలో 118 మందికి ఒకే చోట లేఅవుట్ వేసి ఇచ్చారు. 32 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసుకున్నారు.
- కోటవురట్ల మండలంలో మంజూరయిన 1350 ఇళ్లకు గాను 180 పూర్తి కాగా 840 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.
- నక్కపల్లి మండలంలో 2609 ఇళ్లకుగాను 455 ఇళ్లు పూర్తి కాగా మరో 1620 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.
- పాయకరావుపేట మండలంలో 2987 ఇళ్లకు గాను 540 ఇళ్లు పూర్తికాగా మరో 1980 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.



చందనాడలో గృహప్రవేశం పూర్తి చేసుకున్న ఇల్లు

- ఎస్.రాయవరం మండలంలో 2130 ఇళ్లకు గాను 560 ఇళ్లు పూర్తి కాగా మరో 1340 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.

లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు

- కోటవురట్ల మండలంలో రూ.6.21 కోట్లు, నక్కపల్లి మండలంలో రూ.12 కోట్లు, పాయకరావుపేట మండలంలో రూ.17 కోట్లు, ఎస్.రాయవరం మండలంలో రూ.14 కోట్ల మేర బిల్లుల చెల్లింపులు జరిగినట్టు గృహనిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. జగనన్నకాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కలెక్టర్, జేసీ, ఆర్‌డీవో, డీపీవో, తహసీల్దార్, ఎంపీడీవో గృహనిర్మాణశాఖ అధికారులను, సచివాలయ సిబ్బందిని బాధ్యులను చేసి లక్ష్యాలను నిర్ణయించడంతో వీరంతా జగనన్న కాలనీలను తరచూ సందర్శిస్తూ ఇళ్ల నిర్మాణాల గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం, ఇళ్ల పురోగతిపై సమీక్షలు నిర్వహించడంతో పనుల్లో పురోగతి కనిపిస్తోంది.

గృహప్రవేశం చేశాం



మాకు పీఎల్‌పురం వద్ద మెగా లేఅవుట్ వేసి ప్లాటు కేటాయించారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడంతో పాటు ఇసుక, సిమెంట్, ఇనుము సరఫరా చేసింది. బిల్లులు కూడా సకాలంలో చెల్లించడంతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశం కూడా చేసుకున్నాం. జగనన్న దయ వల్ల మాకు సొంతింటి కల నెరవేరింది.

– శీలా అచ్యుతవేణి, పాయకరావుపేట

మౌలిక సదుపాయాలు కల్పించారు



గ్రామానికి దూరంగా కొండను ఆనుకుని లేఅవుట్ వేయడం వల్ల మొదట్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. ప్రభుత్వం కాలనీకి రోడ్లు, విద్యుత్, తాగునీరు సదుపాయాలు కల్పించడంతో లబ్ధిదారులంతా ముందుకొచ్చి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. దాదాపు 20 వరకు గృహప్రవేశాలు కూడా పూర్తి చేశారు. జగనన్న దయ వల్ల పేద వాడికి సొంత ఇంటి కల నెరవేరింది.

– తళ్ల భార్గవ్, చందనాడ

ప్రతి శనివారం హౌసింగ్ డే



ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహిస్తున్నాం. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను బాధ్యులను చేసాం. గృహనిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది సాయంతో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకున్నాం. కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలు కలిపించడం జరుగుతోంది. పంచాయతీ నిధులతో రోడ్లు తాగునీరు సదుపాయం కల్పిస్తున్నాం. ట్రాన్స్‌కో వారితో విద్యుత్ సదుపాయం కూడా ఏర్పాటు చేశాం. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం జోరుగా జరుగుతోంది.

– సీతారామరాజు, ఎంపీడీవో నక్కపల్లి

నాగవరంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



నాగవరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు కోరారు. నాగవరంలో శనివారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తుందన్నారు. డాక్టర్ అనిల్‌కుమార్ కార్యక్రమానికి హాజరైన వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలిపిని రమణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు విధిగా వేయించుకోవాలి



అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం : దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలకుండా చిన్న వయస్సులో టీకాలు విధిగా వేయించుకోవాలని పెనుగొల్లు హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. కొరుప్రోలు వెల్‌నెస్ కేంద్రంలో శనివారం యుఐపీ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. టీబీ, పోలియో, మెదడువాపు, కోరింత దగ్గు, ధనుర్వాతం తదితర వ్యాధులు రాకుండా టీకాల ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సాయికుమార్, హెల్త్ అసిస్టెంటు దేవరాజు, ఏఎన్ఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటింటా 'సంక్షేమ' ప్రచారం



తిమ్మరాజుపేటలో ఐదు ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేస్తున్న సచివాలయ కన్వీనర్ జగన్



దుప్పితూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాలు అమలు తీరుపై గ్రామాల్లో నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు ...మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని శనివారం సత్యవరం గ్రామంలో నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అమలు తీరు, లబ్ధి పొందుతున్న లబ్ధిదారులు ఏఏ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయో, గత ప్రభుత్వం పని తీరు, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని తీరు ఏవిధంగా వుంది.. అనే విషయాలను ప్రతి ఇంటికి వెళ్లి అడిగి తెలుసుకుని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్టిక్కరును డోర్‌కి అతికిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఫోన్ నంబర్‌కు ఆయా వ్యక్తులకు చెందిన ఫోన్ నంబరుతో మిస్డ్ కాల్ ఇప్పిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రభుత్వ విధానం పై ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సకిలేటి రాము, సచివాలయ మండల కన్వీనర్ బొలిశెట్టి శ్రీను, సచివాలయ కన్వీనర్లు ఎగదాసు శేఖర్, కీర్తి నాగేశ్వరరావు, మేడపాటి వేణి, కాకర కృష్ణ, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో 'మా నమ్మకం నువ్వే జగన్'

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురం గ్రామంలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ భీముని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ రావి నాగలక్ష్మి, శోభన్‌బాబు, భీముని నాగేశ్వరరావు, బుదిరెడ్డి భాస్కర్‌రావు, గొర్లె శ్రీనివాసరావు, కాశీ, రాంబాబు, కాశీ నాయుడులు ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లు అంటించారు. జగనన్నకు చెప్పుకుందాం నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి వారి అభిమతాన్ని తెలుసుకున్నారు.

దుప్పితూరులో...

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పితూరులో 'మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గృహ యజమానుల అంగీకారంతో జగన్ స్టిక్కర్లు అంటించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, దేశంశెట్టి కాసుబాబు, దేశంశెట్టి ఈశ్వరరావు, శెట్టి నాగేశ్వరరావు, మాడెం సూరి అప్పారావు, ఊశా వరహాలమ్మ, నర్మాల సంతోష్, చీపురుపల్లి సన్యాసిరావు, జ్యోతి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

మునగపాక : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని తిమ్మరాజుపేట సచివాలయ కన్వీనర్ కాండ్రేగుల జగన్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మరాజుపేటలో శనివారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా గుర్తించి రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలకాలని ప్రచారం నిర్వహించారు. అలాగే ప్రజల నుంచి ఐదు ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేశారు. ప్రజలకు రానున్న రోజుల్లో సువర్ణ పాలన అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న నాయకులు

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం

యలమంచిలి : సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ను మళ్లీ గెలిపించుకోందామని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. మండలంలో పీఎస్‌ఆర్‌పేట, పేట బయ్యవరం గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలపై కరపత్రం అందించి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందరికీ అందుతున్నాయా అని ప్రతి లబ్ధిదారుడిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్లు లబ్ధిదారుల ఇంటికి, యాజమాని సెల్‌ఫోన్‌కి స్టిక్కర్‌లు అతికించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొన్నాబత్తుల శివ సచివాలయ కన్వీనర్లు,గృహాసారథులు తదితరలు పాలత్గొన్నారు.

12 వార్డులో మానమ్మకం నువ్వే జగన్

యలమంచిలి పట్టణం 12 వార్డులో మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపుగుప్తా ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



పిఎస్ఆర్ పేటలో సంక్షేమ పథకాలు గురించి ఆరా తీస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్

జగనన్న పాలనలో ఇంటింటా సంతోషం



పెదకలవలాపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : జగనన్న సంక్షేమ పాలనలో ఇంటింటా సంతోషం నెలకొందని ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. పెదకలవలాపల్లి గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా గ్రామంలో వున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శారద నదిలో వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరారు. పలువురు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నకు అండగా వుండాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ , ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు డీఎస్ఎన్ రాజు, సర్పంచ్ యలమంచిలి కనకారావు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పర్యవేక్షించాలి

ఎస్.రాయవరం : ఉపాధి హామీ పనుల వద్ద ఎన్ఆర్జీఎస్ అధికారులు పర్యవేక్షణ పూర్తి కరువయ్యిందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ విమర్శించారు. పెదగుమ్ములూరు గ్రామంలో శనివారం ఉపాధి పనులు పరిశీలించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. రోజువారి కూలి రూ. 20 నుంచి మొదలుకుని గరిష్టంగా రూ. 60 వరకు ఇస్తున్నారన్నారు. వ్యవసాయ కూలీలు సహా రోజుకు రూ. 300 నుంచి రూ.500 తెచ్చుకునే ఈ రోజుల్లో ఉపాధి హామీ పథకంలో కనీస గిట్టుబాటు వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. పని కేటాయింపు చేసే విధానం సిబ్బంది అధికారులు అవగాహన కల్పించక పోవడం వల్ల కూలీలు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మేట్లుకి పని అప్పజెప్పి జరిగే పని విధానాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఇక ఏపీవో, టెక్నికల్ టీమ్ పరిశీలన పూర్తిగా పేపర్లకే పరిమితం అవుతుందన్నారు. కూలీలు చేసిన పనులు, ఇచ్చే నగదు సకాలంలో ఇవ్వడం లేదని విమర్శించారు. ఇకనైనా జిల్లా అధికారులు ఉపాధి పనులు సక్రమంగా పర్యవేక్షించాలని కోరారు.

'మా నమ్మకం నువ్వే జగన్' విజయవంతం కావాలి

పేట నేతలకు సుబ్బారెడ్డి సూచన



విశాఖలో సుబ్బారెడ్డిని కలిసిన నియోజకవర్గ నేతలు

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం విజయవంతం చేయాలని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆదేశించారు. పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నేతలు శుక్రవారం రాత్రి విశాఖలో సుబ్బారెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా పనిచేస్తూ నియోజకవర్గంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. త్వరలోనే పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటించి, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పార్టీ తరపున ఎన్నికయిన ప్రజాప్రతినిధులందరితో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి కార్యకర్తతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని జగనన్న దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అందరం కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా పార్టీ కోశాధికారి బొలిశెట్టి గోవిందు, ఎంపీపీలు రత్నం, లోవలక్ష్మి, జెడ్పీటీసీలు గోసల కాసులమ్మ, కాకర దేవి, మాజీ ఎంపీపీ శారదాకుమారి, వైస్ ఎంపీపీలు దత్తుడు సీతబాబు, ఈశ్వరరావు, వీసం నానాజీ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజేష్, విద్యార్థి విభాగం మాజీ అధ్యక్షుడు హరిబాబు తదితరులు ఉన్నారు.

సిరసపల్లిలో ఉపాధి పనులకు భూమిపూజ



సిరసపల్లిలో ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక : ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి కోరారు. సిరసపల్లిలో ఈ ఏడాది కొత్తగా చేపట్టనున్న పనులకు సంబంధించి శనివారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కాలువలు, చెరువుల అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని, వలస కూలీలను నివారించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పథకం కింద పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. ఎంపీటీసీ వీరునాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎముకల సాంద్రతపై సదస్సు నేడు

అనకాపల్లిటౌన్ : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జార్జిక్లబ్‌లో ఆదివారం ఉదయం 7 గంటలకు కీళ్ల వ్యాధి నిపుణులు ఆళ్ల వసంతకుమార్‌తో ఎముకల సాంద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ శనివారం పేర్కొన్నారు. క్లబ్ సభ్యులందరూ విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

14 నుంచి దేశ వ్యాప్తంగా సభలు, పాదయాత్రలు

పాయకరావుపేట : ఈ నెల 14 నుంచి వచ్చే నెల 15 వరకు అంబేడ్కర్ జయంతి రోజు నుంచి దేశవ్యాప్తంగా సభలు, పాదయాత్రలు, నిర్వహించడం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ అన్నారు. పట్టణంలో గల పాండురంగ దేవస్థానంలో సీపీఐ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ హటావో దేశ బచావో అనే నినాదంతో జాతీయ నాయకులతో పాదయాత్రలు, నిరసన సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, పార్టీ నాయకులు రావు జగ్గారావు, సుబ్బలక్ష్మి, వి.అర్జునరావు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మిషన్ వాత్సల్య దరఖాస్తు అందజేస్తున్న మందపాటి సునీత

అనకాపల్లిటౌన్ : తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. స్థానిక శ్రీరామ్‌నగర్ మరిడిమాంబ అమ్మవారి ఆలయంలో పథకందరఖాస్తు ఫారాలను శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకంలో ఎంపికైన పిల్లలకు ప్రతి నెలా రూ. 4వేలు అందజేస్తున్నట్లు ఆమె చెప్పారు. తల్లిదండ్రులు లేని పిల్లల ధ్రువీకరణపత్రాలను దగ్గరలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ నేతలు పలకా సత్యనారాయణ, మూనూరు శ్రీనివాసరావు, ఉగ్గిన శ్రీను, రమేష్ గుప్తా పాల్గొన్నారు.